జిరాయితీ భూములో ఇసుక తవ్వకాల అనుమతులపై పరిశీలన

విశాలాంధ్ర-కోటవురట్ల: మండలంలో గొట్టివాడ సమీపంలో వరాహనదిని ఆనుకొని ఉన్న జిరాయితి భూము లో ఇసుక తవ్వకాలు అనుమతులపై శుక్రవారం మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. జిరాయితి భూమిలో ఉన్న ఇసుకను తొలగించే క్రమంలో వరాహ నదికి చుట్టుపక్కల ప్రభుత్వ భూమికి ఎటువంటి నష్టం జరగకుండా అనుమతుల ప్రకారం ఇసుక తరలింపుకు అనుకూలమైన పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలకు అనుమతుల మంజూరుకు నివేదికలు తయారుచేసి ఉన్నత అధికారులకు పంపిస్తామని మైనింగ్ రాయల్టీ ఇనస్పెక్టర్ జి సత్యమూర్తి తెలిపారు. ఆయన వెంట తహసిల్దార్ తిరుమలబాబు, ఆర్ ఐ ఊర్ధవరావు, సర్వేయర్ అమ్మాజీ ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం పై సంతృప్తి స్థాయిని పెంచేందుకు కృషి చేయాలి

ఇసుక అక్రమ రవాణా, బెల్ట్ షాపులు నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : రెవెన్యూ గ్రామ సభలలో రీ సర్వే అభ్యంతరాలపై వచ్చిన అర్జీలపై పూర్తి విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్ శాఖల పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మొదటిగా రీ సర్వే, గ్రామసభలు, పి జి ఆర్ ఎస్ తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతోను, అనంతరం మైనింగ్, ప్రొవిషన్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలలో వచ్చిన అర్జీలపై సంపూర్ణ అవగాహన..స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఆచరణతోనే సమస్య పరిష్కారం సులభం అవుతుందని, తాసిల్దారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమస్యల పరిష్కారానికి సిబ్బందికి తగు సూచనలు ఇవ్వాలని తెలిపారు. రీ సర్వే అభ్యంతరాలపై రోజువారి నివేదికలు సిద్ధం చేసుకోవాలని, నిబంధనలు అనుసరించి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభలలో ప్రత్యేక సమస్యలు ఏమైనా ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అందుకుగాను వచ్చిన ప్రతీ అర్జీని అవగాహన చేసుకోవడం, అర్జీ దారుని వద్దకు వెళ్లి సమస్య గూర్చి మాట్లాడడం, సమస్య సంబంధిత శాఖ పరిధిలోనిది కాకపోతే తెలియజేయడం, అందుకు గల కారణాలను వివరించడం, తదుపరి కార్యాచరణ పై అర్జీదారునికి అవగాహన కల్పించడం వంటి పంచ సూత్రాలను పాటించాలని తెలియజేసారు. 22 ఏ భూములకు సంబంధించి అనుమానాలు ఉంటే ఉన్నతాధికారుల వద్ద వివరణ తీసుకోవాలన్నారు. జిల్లాలో మాజీ సైనికులకు ఇచ్చిన భూమి వివరాలు, పట్టా కొరకు దరఖాస్తు చేసిన వివరాలు వెంటనే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం గనుల శాఖ అధికారులతో సమీక్ష చేస్తూ గనుల కేటాయింపుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై సమీక్ష చేశారు. జిల్లాలో లభ్యమవుతున్న లాటరైట్, క్లే, కలర్ గ్రానైట్, గ్రావెల్ గనులకు సంబంధించి అనుమతులు మంజూరుకు పెండింగు దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గనుల అక్రమ తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖకు సంబంధించి సమీక్షలో ప్రభుత్వం రూపొందించిన లిక్కర్ పాలసీని సక్రమంగా అమలు చేయాలన్నారు. మద్యం షాపులపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడి గుడికి దగ్గరలో షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపులు నిర్వహించకుండా అరికట్టాలని, అందుకు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఎస్ డి సి లు, ఆర్డీఒ లు షేక్ ఆయిషా, వివి రమణ, తహసీల్దార్లు, డీటీలు సర్వేయర్లు, మైనింగు, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవతో గ్రామాల పరిశుభ్రత

విశాలాంధ్ర-పరవాడ : స్వచ్ఛతా హీ సేవతో గ్రామాల పరిశుభ్రత సాధ్యపడుతుందని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం గ్రామంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య సిబ్బంది ఎన్ డబ్ల్యూపీ షెడ్ మార్గంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. అంతకు ముందు తమ పరిసరాలను పరిశుభ్రగా ఉంచుతామని మాజీ ఎంపీపీ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కె.హెచ్.వి సత్యనారాయణ, వార్డు సభ్యులు వి.ముత్యాలు, కె. నాగరాజు, పి. అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో ఉల్లాస్

విశాలాంధ్ర-నాతవరం: శుక్రవారం నాతవరం వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 కామిరెడ్డి వరహాలబాబు మాట్లాడుతూ నిర్లక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ ఉల్లాస్ కార్యక్రమం ఉ ద్దేశ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు మానేసిన వారిని గుర్తించి వారికి అక్షర పరిజ్ఞానం అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కనకరాజు, ఏఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-మాకవరపాలెం : మండలం పి పి అగ్రహారం పంచాయతీ లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు బొంతు రాజు బాబు ,బొంతు శ్రీను. ఈ సందర్భంగా బొంతు రాజబాబు మాట్లాడుతూ రెండు సంవత్సరాలకి ఒక్కసారి 100 రూపాయలు చెల్లిస్తే సభ్యులకు ఇన్సూరెన్స్ సదుపాయం ఉంటుందని అలాగే ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే మరణించిన వారి కుటుంబానికి ఐదు లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని అన్నారు. గతంలో ఈ మొత్తం 2 లక్షలు ఉండేదని ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఐదు లక్షలుకి పెంచినట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వారికి మట్టి ఖర్చులు నిమిత్తం పదివేల రూపాయలు తెలుగుదేశం పార్టీ భరిస్తుందని ఆయన తెలిపారు.

హోరా హోరీగా హాకీ పోటీలు

విశాలాంధ్ర-నక్కపల్లి : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ అండర్ 14 బాలబాలికల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు బాలుర విభాగంలో ఐదు జట్లు అడగా తూర్పుగోదావరి జిల్లా కర్నూల్ పోటీ పడగా తూర్పుగోదావరి జిల్లా విజయం సాధించింది. ప్రకాశం విజయనగరం పోటీ పడగా టైగా ముగిసింది. గుంటూరు శ్రీకాకుళం పోటీ పడగా గుంటూరు విజయం సాధించింది. కృష్ణ నెల్లూరు పోటీ పడగా నెల్లూరు విజయం సాధించింది. అనంతపురం పశ్చిమ గోదావరి జిల్లా పడగా అనంతపురం విజయం సాధించింది. బాలికల విభాగంలో నెల్లూరు కృష్ణ తలపడగా కృష్ణా జిల్లా విజయం సాధించింది. తూర్పుగోదావరి జిల్లా శ్రీకాకుళం పోటీ పడగా తూర్పుగోదావరి జిల్లా విజయం సాధించింది. విజయనగరం కర్నూలు పోటీ పడగా టైగా ముగిసింది. చిత్తూరు ప్రకాశం పోటీ పడగా టైగా ముగిసింది. పశ్చిమగోదావరి గుంటూరు పోటీ పడగా టైగా ముగిసింది.

ఏసిబి కి పట్టుబడ్డ తామరం వీర్వో లక్ష్మణరావు

విశాలాంధ్ర-మాకవరపాలెం : అనకాపల్లి జిల్లా మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం లో లంచం తీసుకుంటూ తామరం విఆర్ఓ లక్ష్మణరావు ఏసిబి అధికారులకు పట్టుబడ్డారు. లక్ష్మణరావు తామరం తో పాటు భీమబోయిన పాలెం, శెట్టిపాలెం రెవిన్యూ గ్రామాలకు వి ఆర్ ఓ గా పనిచేస్తున్నారు అయితే భీంబోయినపాలెం రెవిన్యూ లో 7.015 సెంట్లు భూమి మ్యూటేషన్ చేయడానికి 15వేల రూపాయలు రైతు వద్ద నుండి లంచం తీసుకుంటూ తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులకు చిక్కాడు.

డీఎస్సీ కోచింగ్ ప్రోగ్రాంలో ప్రవేశాలకు 10న స్క్రీనింగ్ టెస్ట్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా డీఎస్సీ కు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ డీఎస్సీ కోచింగ్ ప్రోగ్రాం లో ప్రవేశాల కొరకు స్క్రీనింగ్ టెస్ట్ తేదీ10-11-24 ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు ఆయా సెంటర్స్ లో నిర్వహించుట జరుగుచున్న సందర్భంగా అభ్యర్థులు పరీక్ష ప్రారంభ సమయానికి 30 నిమిషాలు ముందుగా ఉదయం 9:30 నుండి ఉదయం 10 గంటలకు పరీక్షా హాలుకు ఐడి ప్రూఫ్ తో మరియు హాల్ టికెట్ తో రిపోర్ట్ చేయవలెను , లేటుగా వచ్చిన వారికి పరీక్ష హాలు లోనికి ప్రవేశము అనుమతించబడదు. హాల్ టికెట్లు https://jnanabhumi.ap.gov.in నుండి డౌన్లోడ్ చేసుకోవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయడమైనది.

జాతీయ రహదారి పక్కన అక్రమ నిర్మాణం

చోద్యంచూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

విశాలాంధ్ర-వరవాడ: జీవీఎంసీ 84వ వార్డు పరిధి జాతీయ రహదారిని ఆనుకొని ఓ అక్రమ షెడ్ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన జరుగుతోంది. సాలాపువానిపాలెం సచివాలయ పరిధిలో జరుగుతున్న ఈ అనధికార నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేనప్పటికీ అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ భవన నిర్మాణదారులు మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి మరీ అడ్డదారుల్లో నిర్మాణం చేపడుతున్నారు. అనధికార నిర్మాణాన్ని అడ్డుకోవలసిన టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది. ఓ పక్క నిర్మాణం జరుగుతుండగానే మరోపక్క ఆ నిర్మాణానికి రంగులు వేస్తూ ఉండడం చూస్తుంటే అధికారుల సహాయ సహకారాలు కూడా అందిస్తున్నట్లే కనిపిస్తోంది. అయితే దీనిపై స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ దొరని వివరణ కోరే ప్రయత్నం చేసినప్పటికీ రెండు రోజులుగా ఆయన ఫోను లిఫ్ట్ చేయడం లేదు. మరోపక్క మామూళ్ల కారణంగానే అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి హైవే పక్కన జరుగుతున్న అనధికార నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాయకరావుపేటలో టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-పాయకరావుపేట: పట్టణంలోని 5వ వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, మలిపెద్ది వెంకటరమణ, కర్రా శ్రీను, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, మలిపెద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ నైపుణ్యంతో సైబర్ నేరాల ఛేదన

మితిమీరిపోతున్న సోషల్ మీడియాపై జాగ్రత్త : ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్రబ్యూరో-అనకాపల్లి: కంప్యూటరు నైపుణ్యం, మెలుకువ లతో సైబర్ మోసాలను సులువుగా ఛేధించవచ్చునని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.చోరీ కేసుల్లో పోయిన నగదు కన్నా సైబర్ క్రైమ్స్ ద్వారా ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు కోల్పోతున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేయడం, వ్యక్తి హననం, కులమత వర్గ విభేదాలు సృష్టించే వ్యక్తులను సాంకేతిక నైపుణ్యంతో కనిపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో గల ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరం లో సోషల్ మీడియా పోస్టులు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాల ఛేదనకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ తుహిన్ సిన్హా ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాల కేసులను, సోషల్ మీడియా కేసులు దర్యాప్తుకు సంబంధించి ప్రత్యేకమైన టూల్స్ ద్వారా ఖచ్చితమైన సమాచారం, నేరానికి పాల్పడిన ప్రదేశం గుర్తించవచ్చు అన్నారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు కోటి 20 లక్షలు పట్టుకున్నట్లు సంబంధిత కోర్టులు ద్వారా త్వరలో బాధితులకు అందజేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో చోరీ లలో పోగొట్టుకున్న నగదు కన్నా సైబర్ మోసాల ద్వారా ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు పోగొట్టుకునే అవకాశం ఉందన్నారు. అందుకు అధికారులు ఇటువంటి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా పటిష్టమైన దర్యాప్తు చేసి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. అదే విధంగా జిల్లా పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు ప్రజలకు వివిధ రూపాల్లో జరిగే సైబర్ మోసాల గూర్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.దర్యాప్తు అధికారులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు గాను సైబర్ నిపుణులు సాయి రామానుజ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కావున, సైబర్ మోసాల, నేరాల కేసులను దర్యాప్తు చేసే అధికారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగు పర్చుకుని, భవిష్యత్తులో పోలీసుశాఖ కు పెను సవాలుగా నిలిచే సైబర్ క్రైం కు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారాన్ని అందించ వద్దన్నారు. చాలామంది అత్యాశతో, అవగాహన లోపంతో సైబర్ మోసాలకు గురవుతున్నారన్నారు.సైబర్ నిపుణులు సాయి రామానుజ మాట్లాడుతూ. సైబర్ నేరాలను, మోసాలను ఛేదించడం చాలా సులభమని, అందుకు అవసరమైన అవగాహన, వృత్తి నైపుణ్యం దర్యాప్తు అధికారులకు అవసరమన్నారు. కొన్ని మేళకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించ గలిగితే చాలా సైబర్ మోసాలను ఛేధించ వచ్చునన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జీ.ఆర్.ఆర్. మోహన్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ టి.కళ్యాణి, ఐటి కోర్ ఎస్సై బి.సురేష్ బాబు, ఐటి కోర్ సిబ్బంది, అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పలువురు సిఐలు, ఎస్సైలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-పాయకరావుపేట: నిబంధనలు అతిక్ర మించి చేస్తున్న చేప పిల్లల ఎగుమతులను వెంటనే నిలిపివేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.ప్రసాద్ అన్నారు. మండలంలోని పెంటకోట సముద్ర తీరంలో చేప పిల్లలను పట్టుకొని ఒరిస్సాకు ఎగుమతులు చేస్తున్నారని, దీని ద్వారా మత్స్యసంపద పునరుత్పత్తి తగ్గిపోయి జీవనోపాధి లేకుండా పోతున్నామని గ్రామానికి చెందిన మచ్చ అప్పలరాజు, జి.అనిల్‌కుమార్, జి.కామేశ్వరరావు, ఎం.బాపాజి తదితరులు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ పెంటకోట గ్రామంలో విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారులను, చేపపిల్లల ఎగుమతులు చేసే వారికి ఒక చోటకు పిలిపించి వారితో చర్చలు జరిపారు. సుమారు 200కుటుంబాలు ఉన్న మత్స్యకారులైన తాము తాండవనది, సాగర సంగమం వద్ద తాండవనది పరివాహక ప్రదేశంలో చేపల వేట చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. అయితే కొంత కాలంగా గ్రామానికి చెందిన కొందరు ఒరిస్సాకు చెందిన కొందరితో కలిసి సముద్రతీరంలో చిన్న చిన్న చేప పిల్లలను పట్టి ఎగుమతులు చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా మత్స్యసంపద ఎదగకుండానే తగ్గిపోతుందని తెలిపారు. తాము చేస్తున్న చేప పిల్లల ఎగుమతులు ఇతర ప్రదేశాల్లో కూడా చేస్తున్నారని మరొక వర్గం మత్స్యకారులు తెలిపారు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు వాగ్వివాదం చేసుకున్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ సముద్ర తీరంలో చేప పిల్లలు పట్టి ఎగుమతులు చేయడం నిబంధనలు అతిక్రమించడమేనని తెలిపారు. వెంటనే పనులు నిలిపివేయాలని లేదంతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడి షేక్ జాస్మిన్, ఎంపిటిసి లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంపై అపోహల వద్దు

విశాలాంధ్ర-యస్. రాయవరం : రాష్ట్ర ప్రభుత్వము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై అపోహాలొద్దని తహసిల్దార్ జై రమేష్ బాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు నిర్ణయించగా గతంలోని దీపం, ఉజ్వల్ 1,ఉజ్వల్ 2,సి ఎస్ ఆర్ జనరల్ పథకాల ద్వారా తీసుకున్నా వారు తెల్ల రేషన్ కార్డు ఆధార్ కార్డు అనుసంధానం వారికి బ్యాంక్ ఖాతా ద్వారా నగదును చెల్లించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ సచివాలయంలో గాని తహసిల్దార్ కార్యాలయంలో గాని సంప్రదించాలని అభ్యర్థించారు.

మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-యలమంచిలి: మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు సంబంధించిన సోముదేవుపల్లిలో హెడ్ వాటర్ వర్క్ నుండి మంచి నీటిని సరఫరా చేయు ఆర్ డబ్ల్యూఎస్ పంపింగ్ లైన్ మరమ్మత్తులకు గురైనందున 9 (శనివారం) యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో పాత వీధి, తులసి నగర్, కాకివని వీధి, కుమ్మరి వీధి, భవన్ ఋషి ఏరియా, కోర్టు ఏరియా, నాగేంద్ర కాలనీ, కోర్టుపేట, కొత్తపేట, భవనం వీధి, రాంనగర్, ఏ ఎస్ ఆర్ కాలనీ, ఎన్ టి ఆర్ కాలనీ ఏరియాలో నీటి సరఫరా జరగదని మున్సిపల్ ఇంజనీర్ అధికారి తెలిపారు. పైన తెలిపిన ఏరియాలో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా జరుగుతుందని అన్నారు.

'ఉల్లాస్ ' ద్వారా అక్షరాస్యత

విశాలాంధ్ర-కే కోటపాడు: స్వయం శక్తి సంఘాలలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్క వాలంటరీ టీచర్ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో ఏ సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ' ఉల్లాస్ ' అక్షరాస్యత కార్యక్రమం పై గ్రామ వాలంటరీ టీచర్లకు ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఉల్లాస్ కార్యక్రమం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయని అన్నారు. ఎంపిక చేసిన అభ్యాసకులకు ప్రతిరోజు రెండు గంటల పాటు గ్రామాల్లో ఉన్న అంగన్వాడి లేదా సామాజిక భవనాల వద్ద తరగతులు నిర్వహించాలన్నారు. మొదటి దశలో మండలానికి నిర్దేశించిన 490 మంది స్వయం శక్తి సంఘ సభ్యులను అక్షరాస్యులను చేయాలని అన్నారు. శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన యువజన విద్యాశాఖ ఏడి బి చిన్నికృష్ణ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం 15 నుండి 50 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి నిరక్షరాస్యులను చదవడం రాయడం నేర్పించాలని అన్నారు. వచ్చే సంవత్సరం మార్చిలోగా నిర్దేశించిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కే చినబాబు ఏవో అప్పలరాజు వెలుగు సీసీలు వెంకటరావు ఉమామహేశ్వరి నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు : డీఈఓ అప్పారావు నాయుడు

విశాలాంధ్ర-నక్కపల్లి : విద్యార్థిదశనుండే విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు అన్నారు. శుక్రవారం నక్కపల్లిలో మూడురోజులు జరిగే అండర్ 14 బాలబాలికల హాకీ రాష్ట్ర స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు.క్రీడలలో నైపుణ్యం పెంపొందించుకుని ధ్యాన్ చంద్ స్థాయికి ఎదగా ఎదగాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు.క్రీడలకు పేదరికం అడ్డుకాదన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందన్నారు. తాను చదువుకునే రోజులలో చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఎన్నో పతకాలను సాధించానని స్ఫూర్తి దాయకమైన మాటలను మాట్లాడారు.అనంతరం ఎస్.జి.ఎఫ్.రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు మాట్లాడుతూ నక్కపల్లిలో హాకీ టోర్నమెంట్ రెండవసారి నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గోసల కాసులమ్మ, సర్పంచ్ నేతల జయరత్నకుమారి, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వైస్ సర్పంచ్ వీసం నానాజీ, జనసేన నాయకులు తోట నగేష్, మండల తె.దే.పా.నాయకుడు కొప్పిశెట్టి వెంకటేష్, బి.జె.పి.ప్రతినిధి కోసూరి శ్రీను మండల అభివృద్ధి అధికారి సీతారామరాజు, మండలవిద్యాశాఖాధి కారులు నరేష్, నూకరాజు, జిల్లా ఫిజికల్ డైరెక్టర్ ల ప్రతినిధి వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు బి.ఎస్.హాకీ క్లబ్ వ్యవస్థాపకులు సూరిబాబు, కార్యదర్శి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కాంశీపురం-గవరవరం ప్రధాన ఆర్ & బి రహదారి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో కాశీపురం జంక్షన్ నుండి తిమిరాం కలిగొట్ల మీద గా గవరవరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారి గుంతలు మైయమై ఆ రోడ్డు మీద ప్రయాణించే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు.ఈ రహదారిని విస్తరించాల్సిన ఆవశ్యకత వుందని స్థానిక ప్రజలు మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కి విజ్ఞప్తి చేశారు.ఈ విజ్ఞప్తి కి స్పందించి న ఎమ్మెల్యే బండారు రహదారి కి ఇరువైపులా విస్తరణ కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకువచ్చారు.గురువారం నుంచి గవరవరం నుండి కాశీ పురం రహదారి విస్తరణ కు సంబంధించిన మట్టి పనులు ప్రారంభించారు.

గంజాయి కేసులో ముద్దాయి పదేళ్ల కారాగార శిక్ష

సంచలన తీర్పు నిచ్చిన తొమ్మిదవ అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టు

విశాలాంధ్ర-చోడవరం : అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలంలో 2015 జనవరి 17న చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితుడైన బైలపూడి గ్రామానికి చెందిన గాడి శ్రీను పై చోడవరంలోని జిల్లా తొమ్మిదవ అదనపు సెషన్స్ జడ్జి కోర్టు శుక్రవారం వెల్లడించిన తీర్పును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియాకు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2015 జనవరి 17 ఉదయం 07.30 గంటలకు చీడికాడ పోలీస్ వారికీ రాబడిన సమాచారం మేరకు ఎస్సై డి.విశ్వనాథం తన సిబ్బంది తో ఉదయం 8 గంటలకు చీడికాడ మండలం, చుక్కపల్లి గ్రామ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు అనుమానస్పద వ్యక్తులు రెండు మోటార్ సైకిల్స్ పై వస్తుండగా, వారిని తనిఖీ చేయగా అందులో రెండు మూటల్లో 30 కేజీలు గంజాయి ఉన్నందున పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసారు. దర్యాప్తు పూర్తి చేసిన ఎస్సై డి.విశ్వనాథం న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారన్నారు. ఈ కేసును జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో తదుపరి విచారణ పూర్తయిన తర్వాత, చోడవరం, తొమ్మిదవ అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కె.రత్న కుమార్ ముద్దాయి అయిన గాడి శ్రీను కు 10 సం.,లు కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,00,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని, జరిమానా రూ.1,00,000/- కట్టని ఎడల మరో రెండున్నర సం.,ల జైల శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పి.పి ఉగ్గిన వెంకట్రావు వాదనలు సమర్థిస్తూ గౌరవ కోర్టు ఈ తీర్పును వెల్లడించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, దర్యాప్తు అధికారి అప్పటి చీడికాడ ఎస్సై డి.విశ్వనాథం ను మరియు వాదనలు వినిపించిన పీ.పీ ఉగ్గిన వెంకట్రావు, చీడికాడ పోలీస్ లను మరియు కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది కి, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, నిందుతుడికి శిక్ష పడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అధికారులను అభినందించారు.

11న మునగపాక శ్రీసాంబమూర్తి శూలాల మహోత్సవం

వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-మునగపాక: ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉత్సవాల్లో మునగపాక శ్రీ సాంబమూర్తి శూలాల ఉత్సవం ఈనెల 11 న నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది.ప్రతి సంవత్సరం కార్తీక మాసం రెండో సోమవారం ఈ ఉత్సవాన్ని పూర్వీకుల కాలం నుంచి నిర్వహిస్తున్నారు.గత ఏడాది కంటే ఈ ఏడాది శ్రీ సాంబమూర్తి శూలాల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం కూడా స్టేజ్ ప్రోగ్రామ్స్,నేలవేషాలు యధావిధిగా ఉంటాయని ఉత్సవ కమిటీ చెబుతుంది.వాటితోపాటు ఈ సంబరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచే శులాలు ధరించి శివునికి రక్తతర్పణంతో మొక్కులు చెల్లించేందుకు శూలాధారణ భక్తులు సిద్ధంగా ఉన్నారు.ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే రెండంతస్తుల నూలు గుమ్మటం భక్తులకు ఆధ్యాత్మిక కనువిందుగా నిలిచేందుకు సిద్ధం చేశారు.సోమవారం రాత్రి సుమారు 10 గంటల నుంచి మంగళవారం ఉదయం తెల్లవారుజాము వరకు గ్రామ పురవీధుల్లో శూలాల సంబరం కొనసాగుతుంది.

104 ఉద్యోగులను సమస్యలను పరిష్కరించండి

- 104 వైద్య సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పర్యవేక్షణలో వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర-చోడవరం: రాష్ట్ర వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న 104 ఉద్యోగులు డిమాండ్ లు పరిష్కరిం చాలని, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం చోడవరం ఎం.పి.డి.ఓ. కార్యాలయంలో అధికారులను కలసి వ్యవసాయ శాఖ అధికారి (ఏ.ఓ) కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలు గా వేతనాలు ఇవ్వలేదని, తమ కుటుంబాలను పోషించటం చాలా కష్టం అవుతుంది అని వాపోయారు.104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా కేవలము రూ.50 వేలు ఖర్చు తో నిర్వహించి, ప్రజా ధనము వృధా కాకుండా చూడాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి.యఫ్ చెల్లించాలి అని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని, డి. యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని, ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ వర్తింపచేయాలి అని, ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని 104 ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం.యు. స్టాఫ్ చిరంజీవి, దేముడు, విజయ, పావని, కరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని ఘనంగా సత్కరించిన "వీసం"

విశాలాంధ్ర - నక్కపల్లి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత, రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ విజయ సాయి రెడ్డి ని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ శుక్రవారం విశాఖపట్నంలోని మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణ విజయసాయిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు విజయసాయిరెడ్డి పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున గలం విప్పేటట్లు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు ఇప్పటి నుంచి పార్టీ నాయకత్వాన్ని సమయత్వం చేయాలని ఆయన రామకృష్ణకు తెలిపినట్లు తెలిసింది.! పాయకరావుపేట నియోజకవర్గంలో రానున్న కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వవైపు వచ్చినట్లు పనిచేయాల్సిన అవసరం అందరికీ ఉందని ఆ విధంగా ముందడుగులు వేయాలని రామకృష్ణంతో సాయి రెడ్డి మాట్లాడారు. రామకృష్ణ తో పాటు ఆయనను కలిసిన వారిలో ఎంపీటీసీ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొర్ల గోవిందు, గంటా తిరుపతిరావు, సర్పంచ్ తల్లా భార్గవ్ తదితరులు ఉన్నారు.

ఎంఎంఎస్‌లో ఉల్లాస్ కార్యక్రమం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ లో భాగంగా విద్యా వాలంటీర్స్ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపిడిఓ సత్యనారాయణ హాజరయ్యారు. శిక్షణలో ఉల్లాస్ పథకం లక్ష్యం ప్రాథమిక అక్షరాష్యత సంఖ్యశాస్త్రం జీవన నైపుణ్యాలు ప్రాథమిక విద్య నిరంతర విద్య మొబైల్ లో లావాదేవీలు వంటి అంశములను వాలంటీర్లు కు బోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపిఎం కె. జి శివ ప్రసాద్, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

చెత్తనుండి సందప తయారీ కేంద్రంలో వానపాములు విడుదల

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట, గోపాలపట్నం గ్రామాల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల్లో అధికారులు వానపాములు విడుదల చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ జయప్రకాశరావు, సర్పంచ్‌లు పులగపూరి అప్పలనర్స, పన్నీరు బాబ్జి, పంచాయతీ కార్యదర్శి వై.సత్యనారాయణ, కట్టా శ్రీను, వేముల వెంకటేశ్వరరావు, తుమ్మల గణేష్ తదితరలు పాల్గొన్నారు.

ఈకేవైసీపై ఆందోళన వద్దు

విశాలాంధ్ర - రాంబిల్లి : దీపం-2 పథకం లబ్ధిదారులకు అవసరమైన ఈకేవైసీ ప్రక్రియ గ్యాస్ డెలివరీ బాయ్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే ఉచితంగా చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మార్వో శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గత నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుక్ చేసుకుంటే ఈ పథకంలో మొదటి విడత ఉచిత సిలిండర్ సరఫరా జరుగుతుందన్నారు. డెలివరీ బాయ్ వినియోగదారుని ఇంటికి సిలిండర్ తెచ్చినప్పుడు ఖాళీ గ్యాస్ సిలిండర్ సిద్ధంగా ఉంచుకోవాలని, ఈ గ్యాస్ సిలిండర్ ఇతరులకు ఇవ్వరాదన్నారు. లబ్ధిదారుల సమస్యలు, సూచనలు సంబంధిత వార్డు, గ్రామ సచివాలయాలకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1967కు తెలియజేస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకం ఇంట్లో ఒక్కరికే వర్తిస్తుందని తెలియజేశారు.

తల్లి పేరు చెప్పి మొక్కలు నాటండి

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని మంచాల మోడల్ స్కూల్ లో అనకాపల్లి జిల్లా ఎన్ కే వై ఎస్ వారి ఆధ్వర్యంలో తల్లి పేరు చెప్పి ఒక మొక్కను నాటండి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు నిత్యజీవితంలో పర్యావరణం యొక్క ప్రాముఖ్యత అనే అంశంపై

వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన ముగ్గురు విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు, ప్రతి ఒక్కరూ తల్లి చెప్పి ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు, ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ వై చంద్రశేఖర్ , వినయ్ కుమార్, ప్రసన్నకుమార్, జ్ఞానదీపు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 19న ఛలో అమరావతి

విశాలాంధ్ర - పాయకరావుపేట. ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్ అమలుకు వ్యతిరేకంగా డిసెంబర్ 19న చలో అమరావతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఛలో అమరావతికి సంబందించిన కరపత్రాలు విడుదల చేశారు.

దళితులను రాజ్యాధికారం సాధించకుండా సామాజికంగా అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. దళితులను విద్యా, ఉద్యోగ, జీవన రంగాల్లో అవకాశాలను రానీయకుండా దెబ్బతీసి భవిష్యత్తు లేకుండా చేయడానికి పాలకులు సిద్ధం అయ్యారని ఆందోళన వ్యక్తం చేసారు. రాజ్యాంగం కల్పించిన దళితుల రిజర్వేషన్లు, పలు సంక్షేమ పథకాలను రద్దు చేయడానికే క్రిమిలేయర్ విధానంను తీసికొచ్చారని విమర్శించారు. మన హక్కుల రక్షణ కోసం దోపిడీ పాలకులు పైన పోరాటం చేయకపోతే బానిసత్వం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దువ్వాడ దావీదు, మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బోడపాటి రమణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధపై డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా విజయవాడ కేఎల్ యూనివర్సిటీ చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చుండూరు మాధవరావు, రీజనల్ మేనేజర్ ఆఫ్ అకడమిక్స్ వై.శివ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ మీద అవగాహన ఉండాలని, కంప్యూటర్ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తులో పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, మెరుగైన విశ్లేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, నెట్వర్కింగ్ అవకాశాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడు

విశాలాంధ్ర - అనకాపల్లి: అనకాపల్లి రైల్వేస్టేషన్లో ప్లాట్ ఫామ్‌కి జన్మభూమి ఎక్స్ కూ మధ్య చిక్కుకొని ఒక ప్రయాణికులు ప్రాణాలతో బయటపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రావికమతం మండలం తోటకూర పాలెం గ్రామానికి చెందిన పైలా రాజబాబు స్టేషన్లో జన్మభూమి ఎక్స్ప్రెస్ ట్రైన్ ఎక్కుతుండగా జారి ప్లాట్ఫామ్ పై పడిపోయాడు. దీంతో ప్లాట్ఫార్మ్ కు, ట్రైన్ కు మధ్య చిక్కుకుపోయాడు. గమనించిన రైల్వే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బయటకు తీశారు. గాయాల పాలైన రాజబాబును స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కైలాసగిరిని పరిశుభ్రంగా ఉంచాలి

వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ నగరానికి తలమానికంగా ఉన్న కైలాసగిరిని ప్లాస్టిక్ రహితముగా మార్చి శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని వ్యాపారులను వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్, ఇన్చార్జి కార్యదర్శి కొమ్మి రమేష్ కోరారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో కైలాసగిరి వ్యాపారస్తులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే నిలపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు కేటాయించిన పరిధిలో మాత్రమే వ్యాపారాలను నిర్వహించు కోవాలని, అద్దెలను ప్రతి నెలా 5వ తేదీలోగా చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డిఎఫ్ఓ శివానీ, ఈఈ ఎస్‌వీఎస్ఎన్ రాజు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు మోహనరావు, శంకర్రావు, పరిపాలన అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో సమర్థవంతమైన పాత్ర పోషించాలి

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త భరత్

విశాలాంధ్ర-అనకాపల్లి: త్వరలో జరగబోయే నీటి సంఘాల ఎన్నికల్లో పార్టీ రైతులంతా సమర్థవంతమైన పాత్ర పోషించాలని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో నీటి సంఘాల ఎన్నికల సన్నద్ధ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ. రైతులందరూ సమర్థవంతంగా నీటి సంఘాల ఎన్నికలను ఎదుర్కోవాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు గాని, ఏ వర్గాలను గాని పట్టించుకోని పరిస్థితి చూస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతు భరోసా ఇచ్చి రైతులను ఆదుకున్నారని కూటమి ప్రభుత్వంలో రైతులకు మొండిచేయి చూపిస్తున్నారని అన్నారు. రైతుల సమస్యలు పోరాడి సాధించుకోవాలనుకుంటే వైసిపి పార్టీ బలపరిచిన నీటి సంఘాల ఎన్నికల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, పట్టణ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, మండలం ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందు, కశింకోట మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్, మాజీ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కశింకోట మండలం ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, 80వ వార్డు ఇంచార్జ్ కె . ఎం.నాయుడు, 84వ వార్డు ఇంచార్జ్ కోరుకొండ రాఘవ, అనకాపల్లి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, యువ నాయకులు కుమార్ రాజా, మాజీ గౌరీ పి . ఎస్ చెర్మన్ విల్లూరి శివ సూరి, అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పీడీ గాంధీ, మాజీ నూకాంబిక దేవస్థానం డైరెక్టర్ బుద్ధ నరసింహారాజు, రైతు సంఘం అధ్యక్షులు పీలా బుజ్జి, వైస్ ఎంపీపీ అయితా రాము, అనకాపల్లి మండలం యూత్ ప్రెసిడెంట్ పల్లెల సాయికిరణ్, అనకాపల్లి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, పంచాడి పద్మ, గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న వారికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: సాగులో ఉన్న వారికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని మండలంలోని రాజవరం గ్రామ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతులు రీసర్వే గ్రామసభలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, గ్రామసభ వద్ద ఆందోళన నిర్వహించారు. రాజవరం గ్రామంలోని సర్వే నెంబరులో 146లో 99 ఎకరాల భూమి ఉండగా 62.26 ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారని తెలిపారు. మిగిలిని 37.25 ఎకరాల్లో సుమారు 30మంది రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయలేదని తెలిపారు. అంతేగాక ఇటీవల ఆన్‌లైన్‌లో తమ పేర్లను తొలగించి ఇతరుల పేర్లను పొందుపరిచారని తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించి ఆన్‌లైన్‌లో పేర్లు మార్పు మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్‌లో తమ పేర్లు పొందుపరచాలని, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జి.సత్యనారాయణ తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధానకార్యదర్శి బొంది కాశీవిశ్వనాద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏడిద సురేష్, గోసల రమణ, రాజవరం రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు కారే శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి గోసల భూలోక, ఉపాధ్యక్షులు గోసల గోవిందు, కోశాధికారి గోసల బందీరావు, ఎరిపిల్లి అప్పలరాజు, తుమ్మల జగన్నాధం, గోసల శ్రీను, గంటా సత్యవతి, పట్టెం అచ్చిబాబు, మేడిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతో ఆర్థికంగా అభివృద్ధి

విశాలాంధ్ర - యస్. రాయవరం: యస్.రాయవరంలో కోర్సు పూర్తి చేసుకున్న 120 మంది మహిళలకు సర్టిఫికెట్స్ ప్రధానం మరియు లింగరాజు పాలెంలో కొత్త బ్యాచ్ కు ప్రారంభోత్సవం జరిగింది. ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్పందన చేయూత ఫౌండేషన్ స్థాపించి నాలుగు సంవత్సరాలు అయ్యిందని పేదలకు మెడికల్ సహాయం, విద్యాసహాయం, ఆశ్రమాల్లో పేదలకు అన్నదానం , ప్రభుత్వ స్కూల్స్ పిల్లలకు సహాయం, గిరిజనలుకు సహాయం, పేద పిల్లలకు దత్తత తీసుకుని చదివించుట , శాశ్వత ప్రాజెక్ట్ , చేస్తూ మహిళలకు ఉచిత కుట్టి శిక్షణా తరగతులు ఆరు చోట్ల , పదకొండు బ్యాచ్ లు లో సుమారు 380 మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ముఖ్య అతిథి కలిదిండి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ పేదలకు స్పందన చేసే కార్యక్రమాలు చాలా అమోఘమని వారి సేవలు సమాజానికి ఏంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ముఖ్యముగా ఇంటికే పరిమితి మయ్యే గ్రామీణ మహిళలకు ఎంతో చేయూత కలుగుతుందని, అలాగే గ్రామీణ మహిళల కోసం ఫౌండేషన్ వారి ఆరోగ్యం , ఆనందకర జీవన విధానం మరియు పిల్లలు చదువు కోసం ప్రత్యేక శ్రద్ధ ఎలా తీసుకోవాలి వంటి అవగాహన సదస్సులు పెట్టడం వల్ల మహిళలు చైతన్యవంతమవుతారు అని చెప్పారు. విశిష్ట అతిథులు గా విచ్చేసిన అల్లూరి వెంకట గోపాల కృష్ణంరాజు మరియు దండు గణపతి రాజు ఫౌండేషన్ సేవలును మరియు ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ దండు ఝాన్సి లక్ష్మి బాయి ఎంతో ఆదర్శంగా ఉక్కు మహిళ వలె మహిళలు కోసం నిరంతరం సేవలందిస్తున్నారని, లింగరాజుపాలెం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కు కూడా శిక్షణా తరగతులు నిర్వహించాలని కోరారు. ఫౌండేషన్ నుండి కె. వెంకట రావు మహిళల పిల్లలు కు విద్య, ఆరోగ్యం పై అవగాహనతో ఎలా అభివృద్ధి చెందాలి అని చెప్పారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సి మాట్లాడుతూ ఒక లక్ష మందికి ఉచిత కుట్టి శిక్షణ, ఎంబ్రాయిడరీ, ఇవ్వాలని ధ్యేయం అని దానికోసం నిరంతరం కృషి చేస్తానని అని చెప్పారు. ఈకార్యక్రమం లో ఎంఎస్ ఎన్. మూర్తి, సాంబరాజు, దండు గోపాలకృష్ణ రాజు, దండు సత్యనారాయణ రాజు, దండు నారాయణ మూర్తి రాజు, కలిదిండి సుబ్బరాజు, అల్లూరి ఉషారాణి, పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

విశాలాంధ్ర-అనకాపల్లి: పట్టణంలో జీవీఎంసీ 81వ వార్డు గవరపాలెంలోని వేగి వీధి, చిన్న హై స్కూల్ ప్రాంతాలలో రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్, 81వ వార్డు టీడీపీ ఇంచార్జీ మళ్ళ సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఉ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో ఎక్కడా లేనివిదంగా 100లకే 5లక్షల ప్రమాద భీమాను కల్పిస్తున్న ఘనత టీడీపీదే అన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో 30వేలు సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ప్రమాద భీమాతో పాటు ముఖ్యమంత్రి ,టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ,టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ బాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కార్యకర్తలకు విద్యా, వైద్యంలో కూడా అండగా నిలిస్తున్నారని అన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం నమోదు చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మారిశెట్టి శంకర రావు, వేగి కృష్ణ, బెల్లాన శ్రీనివాసరావు, యండకుర్తి అప్పల రాజు, జెర్రిపోతుల నూకరాజు, భాను చందర్ అఖి, గణేష్, మళ్ళ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులను సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-యలమంచిలి: రాష్ట్ర 104 ఉద్యోగులను సమస్యలను పరిష్కరించి 104 వైద్య సేవలను పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ ద్వారా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యలమంచిలి తాసిల్దార్ కి వినతిపత్రం అందజేశాము. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలు గా వేతనాలు ఇవ్వులేదు అని కుటుంబాలను పోషించటం చాలా కష్టం అవుతుంది అని అన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజా దనము వృధాకాకుండా చూడాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. యఫ్ చెల్లించాలి అని తెలిపారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని డి. యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టులో పెట్టాలి అని ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ చేయించాలి అని కోరారు. ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని 104 ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంయు స్టాఫ్ రవి బాబు, రాజా, బాబు, మణికంత పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: క్యాన్సర్ వ్యాధి నివారణ దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీని శుక్రవారం కింగ్ జార్జి సూపరింటెండెంట్ డా. పి.శివానంద, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.బుచ్చిరాజు నిర్వహించారు. ఈ ర్యాలీలో వారు మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు గురించి 6 బ్యాచుల్లో ఫీల్డ్ స్టాఫ్‌కు శిక్షణ ఇప్పించామని, ఆ స్క్రీనింగ్‌లో క్యాన్సర్ లక్షణాలు గల రోగులకు తదుపరి నిర్ధారణ పరీక్షలు జరిపించుటకు కింగ్ జార్జి ఆసుపత్రి నందు ప్రివెంటివ్ అంకాలజి ఓ.పి. విభాగాన్ని కె.జి.హెచ్, సి.యస్.ఆర్. బ్లాకు నందు ఓ.పి. నంబరు 40 నందు ప్రతీ మంగళవారం, గురువారం ఓ.పి. ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఓ.పి. విభాగాన్ని ఈ నెల 12వ తేదీన ప్రారంభించుచున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్ ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ ఆఫీసర్ డా. కె.సాయి సుష్మా, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డా. కె.శిల్ప, రేడియోషిన్ అంకాలజీ విభాగాధిపతి డా. పాండురంగ కుమారి, సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డా. గురురాఘవేంద్ర నాయక్, కెజిహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 పద్మావతి, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోరాడ గ్రామ సభకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర - పద్మనాభం: మండలం కోరాడ గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు అనూహ్యంగా రైతులు తరలివచ్చారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే లో తమ భూమి తమ పేరున పూర్తిగా నమోదు చేయలేదు సరికదా ఒకరి భూమి వేరొకరు పేరుమీద నమోదు చేసారని ప్రభుత్వం రైతులకు మేలు చేయాలనీ చేపట్టిన రీ సర్వే లో ఉద్యోగులు తప్పు చేయడంతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే టట్లు చేస్తున్నారని ఎన్ని ప్రభుత్వాలు మారిన రెవెన్యూ కార్యాలయాలను మార్చే ప్రభుత్వాలు రాలేదని ఉదయం లేచింది మొదలు పొలంలో పని చేసుకునే రైతుకు అవసరానికి తన భూమి తన పేరున లేకుండా చేయడం ఎంత బాధాకరమని కోరాడ, గేద్ద పేట పండగల పేట దువ్వాపేట రైతులు వాపోయారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, రెవెన్యూ ఉద్యోగులు మారుతున్నారు కానీ ఉదయం లేచింది మొదలు పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మా భూమి మారలేదు మా సాగుబడి మారలేదు మధ్యలో విధానాలు మారటంతో చాలా తలనొప్పులు పడవలసి వస్తుందని రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, రీ సర్వే డీటీ వరలక్ష్మి, వి ఆర్ ఓ లు, సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు, టీడీపీ నాయకులు గేద్ద ప్రసాద్ లు తమ వర్గీయుల భూముల వివరాలను తెలిపే దరఖాస్తును అధికారులకు రైతులతో ఇప్పించారు.